ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనకాపల్లి

జిల్లా వార్తలు

శుక్రవారం 30 ఆగస్టు 2024



నర్సీపట్నం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా నియామకం



నర్సీపట్నం, ఆగస్టు 29: నర్సీపట్నం సబ్ కలెక్టర్‌గా ఇటీవల నియమితులైన కేఆర్ కల్పశ్రీని అల్లూరి సీతారామ రాజు జిల్లా రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా మార్పు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సీపట్నం ... మిగతా 8వ పేజీలో

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం



కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజనాథ్ సింగ్‌కు ఐఎన్ఎస్ డేగాలో స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

- నేవల్ బేస్‌లో 'ఐఎన్ఎస్ అరిఘాత్' జాతికి అంకితం చేసిన రాజ్‌నాథ్ సింగ్

విశాఖపట్నం, ఆగస్టు 29: నగరానికి విచ్చేసిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఘన స్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు విశాఖ విమానాశ్రయంలోని ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్న రాజ్‌నాథ్‌సింగ్‌కు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, పలువురు బీజేపీ నేతలు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నేవల్‌బేస్‌కు వెళ్లారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన రెండో అణు జలాంతర్గామి 'ఐఎన్ఎస్ అరిఘాత్'ను జాతికి అంకితం చేశారు. మూడు గంటలకు ప్రత్యేక విమానంలో తిరువనంతపురం బయలుదేరి వెళ్లారు.

ఐటీ రాజధానిగా విశాఖ

రాష్ట్రానికి వచ్చే ఐటీ పరిశ్రమల్లో 90 శాతం ఇక్కడే ఏర్పాటుచేస్తాం

- సమస్యల పరిష్కారానికి ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు
- రాయితీకి భూముల కేటాయింపుపై మంత్రివర్గంలో చర్చిస్తాం
- గత ప్రభుత్వంలో పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన వారిని వెనక్కి రప్పిస్తాం
- విశాఖ విమానాశ్రయానికి కనెక్టివిటీ పెంపు
- అంతర్జాతీయ విమానాలు వచ్చేలా ప్రయత్నిస్తాం
- ఐటీ పరిశ్రమకు మంత్రి లోకేశ్ భరోసా



మంత్రి లోకేశ్‌ను సత్కరిస్తున్న ఐటీ పరిశ్రమల నిర్వాహకులు

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖను ఐటీ రాజధానిగా అభివృద్ధి చేస్తామని, రాష్ట్రానికి వచ్చే ఐటీ పరిశ్రమల్లో 90 శాతం ఇక్కడే ఏర్పాటు చేస్తామని ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. ఐటీ పారిశ్రామికవేత్తలతో ఆయన గురువారం రాత్రి నోవాటెల్ హోటల్‌లో సమావేశమయ్యారు. సుమారుగా రెండు గంటలసేపు సాగిన సమావేశంలో హాజరైన ప్రతి ఒక్కరికీ మాట్లాడే అవకాశం కల్పించారు. వారు అడిగిన ప్రశ్నలు అన్నింటికీ మంత్రి ఓపికగా సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ విధానాలు వివరించారు. గత ఐదేళ్ల ఐటీని ఎవరూ ... మిగతా 7వ పేజీలో

ఎలమంచిలి మునిసిపల్ కమిషనర్‌గా ప్రసాదరాజు

ఏలూరు జిల్లా చింతలపూడి నుంచి బదిలీ




ప్రసాదరాజు

ఎలమంచిలి, ఆగస్టు 29: స్థానిక మునిసిపల్ కమిషనర్‌గా ఏలూరు జిల్లా చింతలపూడి మునిసిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేస్తున్న బీజేఎస్ ప్రసాదరాజు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిసింది. ప్రసాదరాజు గతంలో ఎలమంచిలి కమిషనర్‌గా పనిచేశారు. కాగా ప్రస్తుతం ఇన్‌చార్జి కమిషర్‌గా వున్న ప్రభాకరరావు నుంచి ప్రసాదరాజు త్వరలో బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం.

జల వనరులకు పూర్వ వైభవం!

సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం

- వైసీపీ హయాంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలు నిర్వీర్యం
- ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఎన్నికలు నిర్వహించని పాలకులు
- మరమ్మతులు, నిర్వహణకు నోచుకోని సాగునీటి వనరులు
- ఆయకట్టుకు సరిగా నీరు అందక అన్నదాతల అగచాట్లు
- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో రైతులు హర్షం



పెద్దేరు జలాశయం



కె.కోటపాడు మండలం వారాడ సంతపాలెంలో పూడికతో నిండిన పంట కాలువ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

సాగునీటి వనరుల నిర్వహణ సక్రమంగా వుంటే, ఆయకట్టు భూములకు సకాలంలో పుష్కలంగా నీరు అంది, పంటలు బాగా పండుతాయి. పొలాలకు సక్రమంగా సాగునీరు అందాలన్నా, ఆయకట్టును విస్తరించాలన్నా నీటి వనరుల నిర్వహణ ముఖ్యం. వీటిని నిరంతరం పర్యవేక్షించే సాగునీటి సంఘాలను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. సాగునీటి వనరులు, ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతులను పూర్తిగా గాలికొదిలేసింది. సాగునీటి వనరుల నిర్వహణ నిధులు విదల్చకపోగా... సాగునీటి సంఘాలకు ఒక్కసారి కూడా ఎన్నికలు నిర్వహించలేదు. ఫలితంగా గత ఐదేళ్ల కాలంలో జిల్లాలో సాగునీటి వనరులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. జలాశయాల పంట కాలువలు, సాగునీటి చెరువుల్లో పూడిక పేరుకుపోయింది. ఈ నేపథ్యంలో రెండున్నర నెలల క్రితం అధికారంలోకి వచ్చిన టీడీపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో సాగునీటి సంఘాలకు పూర్వ వైభవం రానున్నది. సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి జిల్లా జలవనరుల శాఖ అధికారులు మార్గదర్శకాలు, తేదీలను త్వరలో ఖరారు చేయనున్నారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 2019వ సంవత్సరానికి ముందు 253 సాగునీటి సంఘాలు ఉండేవి. 2022లో జిల్లాల పునర్విభజన జరగడంతో కొత్తగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో 150కిపైగా సంఘాలు వున్నాయి. వీటిలో పెద్దేరు జలాశయం పరిధిలో 10, రైవాడ పరిధిలో 10, కోనాం పరిధిలో ఎనిమిది నీటి సంఘాలు వుండగా, మిగిలినవి చిన్నతరహా నీటి వనరుల పరిధిలో వున్నాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు గతంలో సీఎంలుగా పనిచేసిన వై.ఎస్.రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డిలు నీటి సంఘాలకు ఎప్పటికప్పుడు ఎన్నికలు నిర్వహించారు. ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లలో నీటి సంఘాల ఆధ్వర్యంలో రైతులతో గ్రామసభలు నిర్వహించే వారు. చెరువులు, కాలువల అభివృద్ధి పను లను గుర్తించేవారు. ఆయకట్టు రైతుల తీర్మానాల మేరకు సాగునీటి వనరుల మరమ్మతు, నిర్వహణ, పూడికతీత వంటి పనులు చేపట్టేవారు. సాగునీటి సరఫరా విషయంలో ఏ చిన్న సమస్య ఎదురైనా... నీటి సంఘాల ప్రతినిధులు స్పందించేవారు. ప్రతిపాదనలు రూపొందించి జలవనరుల శాఖ ఇంజనీర్ల ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపేవారు. అవసరం మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసేది. దీంతో మరమ్మతు, నిర్వహణ పనులు సత్వరమే పూర్తయ్యేవి. ఆయకట్టుకు సాగునీరు ... మిగతా 8వ పేజీలో

అడుగడుగునా స్పీడ్ బ్రేకర్లు

అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డులో ప్రయాణికులకు తప్పని పాట్లు

- గతంలో గోతులతో ఇక్కట్లు.. ఇప్పుడు వేగ నిరోధకాలతో అగచాట్లు
- పది కి.మీ.ల దూరంలో 49 స్పీడ్ బ్రేకర్లు!
- తమ ఇళ్ల ముందు కట్టలు వేయించుకున్న వైసీపీ నేతలు



తిమ్మరాజుపేటలో అత్యంత సమీపంలో వేసిన స్పీడ్ బ్రేకర్లు

అచ్యుతాపురం, ఆగస్టు 29:

ప్రధాన రహదారుల్లో గుడి, బడి, కూడలి వంటి ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించి, ప్రమాదాలను నివారించడానికి స్పీడ్ బ్రేకర్లు వేస్తుంటారు. కానీ వైసీపీ అధికారంలో వున్నప్పుడు ఆ పార్టీ నేతలు ఎక్కడికక్కడ తమ ఇళ్ల ముందు రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు వేయించుకున్నారు. అచ్యుతాపురం- అనకాపల్లి ప్రధాన రహదారిలో తిమ్మరాజుపేట వద్ద కేవలం అర కిలోమీటరు పరిధిలో తొమ్మిదిచోట్ల వేగ నిరోధకాలు వేయించారంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు.

అచ్యుతాపురం- అనకాపల్లి మధ్య పది కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా పాడైపోయింది. అడుగుకో గొయ్యి వుండడంతో ఈ రోడ్డు మీదుగా ప్రయాణం చేయాలంటే వాహనదారులు, ప్రయాణికులు బెంబేలెత్తిపోతుంటారు. పది కిలోమీటర్లు ప్రయాణించడానికి గంటన్నర సమయం పట్టేది. కొన్నిచోట్ల భారీ వాహనాలు గోతుల్లో దిగబడి, మరమ్మతులకు గురయ్యేవి. ఇక రోడ్డు ప్రమాదాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అత్యంత అధ్వానంగా వున్న ఈ రహదారి గురించి వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు పట్టించుకోలేదు. దీంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో సాధారణ ఎన్నికల ముందు స్థానిక వైసీపీ నాయకులు, ఆర్‌అండ్‌బీ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి మొక్కుబడిగా రోడ్డు వేయించారు. దీంతో ప్రయాణికులకు కొంతమేర గోతుల ఇబ్బందులు తప్పినప్పటికీ, స్పీడ్ బ్రేకర్ల రూపంలో కొత్త సమస్యలు తలెత్తాయి. రోడ్డుకు ఇరువైపులా నివాస గృహాలు వున్న పలువురు వైసీపీ నాయకులు... తమ ఇళ్ల ముందు స్పీడ్ బ్రేకర్లు వేయించుకున్నారు. పది కిలోమీటర్ల పరిధిలో మొత్తం 49చోట్ల స్పీడ్ బ్రేకర్లు వేశారు. అచ్యుతాపురం జంక్షన్- చోడపల్లి మధ్య దూరం రెండు కిలోమీటర్లు. ఇక్కడ తొమ్మిది స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. తిమ్మరాజుపేటలో కేవలం 500 మీటర్ల పరిధిలో తొమ్మిది స్పీడ్ బ్రేకర్లు వేశారు. హరిపాలెంలో కూడా ఇదే పరిస్థితి.

టీచర్ల సర్దుబాటు

ముగిసిన మండల, డివిజన్‌స్థాయి ప్రక్రియ



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం (ఫైల్)

- జిల్లాలో 43 హిందీ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- ఇంగ్లిష్ టీచర్ పోస్టులు 12 మిగులు
- జిల్లాస్థాయి కౌన్సెలింగ్‌లో సర్దుబాటు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు తాత్కాలిక ప్రాతిపదికన సర్దుబాటు ప్రక్రియ కోసం చేపట్టిన కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. జిల్లా విద్యా శాఖాధికారులతో సంబంధం లేకుండా స్కూల్ యూడైస్ డేటా, ఉపాధ్యాయునికి సంబంధించి గతంలో ఆన్‌లైన్ పొందుపర్చిన సమాచారం ఆధారంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తి ప్రకారం రాష్ట్ర విద్యా శాఖ కార్యాలయం నుంచే గత రెండు రోజులుగా ఆన్‌లైన్ విధానంలో జిల్లాలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయుల సర్దుబాట్ల ప్రక్రియ జరుగుతోంది. జిల్లా స్థాయిలో అధికారులు ఆన్‌లైన్‌లోనే వివరాలను పరిశీలించి సంబంధిత ఉపాధ్యాయులకు సమాచారం అందజేస్తున్నారు.

గత వైసీపీ ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో అనకాపల్లి జిల్లాలో 765 ఉపాధ్యాయులు మిగులుగా వున్నట్టు తేల్చింది. ఇదే సందర్భంలో వివిధ కేటగిరీలకు చెందిన 238 మంది ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా శాఖలో సాధారణ బదిలీలకు అవకాశం ఇవ్వలేదు. పాఠశాలల్లో విద్యాబోధనకు ఇబ్బందులు ఎదురుకాకుండా మిగులు ఉపాధ్యాయులను పారదర్శకంగా సర్దుబాటు చేసేందుకు విద్యా శాఖ కేంద్ర కార్యాలయం కౌన్సెలింగ్ నిర్వహిస్తోంది. తొలుత మండల స్థాయిలో స్కూల్ అసిస్టెంట్‌ల సర్దుబాటు పూర్తి చేశారు. ఈ క్రమంలో జిల్లాలో డివిజన్ స్థాయిలో సర్దుబాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలలకు 44 మంది హిందీ ఉపాధ్యాయులు అవసరంకాగా ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఆ ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయడంతో మిగిలిన 43 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తేలింది. ఇంగ్లిష్ ఉపాధ్యాయ పోస్టులు మూడు మాత్రమే ఖాళీగా ఉండగా, 15 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఉన్న మూడు పోస్టుల్లోకి ముగ్గురు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి, అదనంగా వున్న 12 మందిని జిల్లాస్థాయి సర్దుబాటు కౌన్సెలింగ్‌లో నియమించే అవకాశం ఉందని విద్యా శాఖాధికారులు చెబుతున్నారు. జిల్లాలో గురువారం వరకు మండల, డివిజన్ స్థాయిలో ఉపాధ్యాయుల సర్దుబాట్లు జరిగాయి. జిల్లాస్థాయి సర్దుబాట్ల కౌన్సెలింగ్ ఇంకా జరగాల్సి ఉందని, ఇందులో మిగులు హిందీ, ఇంగ్లిష్ ఉపాధ్యాయ పోస్టుల సర్దుబాటు జరిగే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖాధికారులు అంటున్నారు.

ఘాట్ మార్గాల్లో భారీ వాహనాల రాకపోకలు నిషేధం

- భారీ వర్షాల నేపథ్యంలో అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశం

పాడేరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండడంతో అలూరి సీతా రామరాజు జిల్లాలోని ఘాట్ మార్గాల్లో భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్టు కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ తెలిపారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలోని మారేడుమిల్లి ఘాట్‌లో మట్టి పెళ్లలు విరిగిపడడంతోపాటు ఓ మలుపు వద్ద భారీ లారీ ఆగిపోవడంతో ఘాట్‌లో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై స్పందించిన కలెక్టర్ భారీ వర్షాల నేపథ్యంలో రానున్న మూడు రోజులు జిల్లాలోని అన్ని ఘాట్ మార్గాల్లోని భారీ వాహనాలను అనుమతించవద్దని రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలను ఆదేశించారు.

వర్షాలతో అన్నదాతకు ఊరట

జిల్లా అంతటా ముసురు, తేలికపాటి జల్లులు



నీటితో నిండుగా వున్న తాండవ జలాశయం

అనకాపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి- న్యూస్ నెట్‌వర్క్): జిల్లాలో గురువారం ముసురు వాతావరణం నెలకొని, తేలికపాటి జల్లులు కురిశాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో వర్షాలు పెరుగుతాయన్న వాతావరణ శాఖ సమాచారంతో అన్నదాతలు ఊరట చెందుతున్నారు. కాగా చోడవరం, రావికమతం, మాడుగుల, ఎస్.రాయవరం, నక్కపల్లి, అచ్యుతాపురం, సబ్బవరం, కె.కోటపాడు, తదితర మండలాల్లో గురువారం ఉదయం కొద్దిసేపు మోస్తరు వర్షం కురిసింది. గొలుగొండ, కోటవురట్ల, ఎలమంచిలి, మాకవరపాలెం మండలాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు తేలికపాటి జల్లులు పడ్డాయి. శుక్ర, శనివారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం వుందన్న సమాచారంతో ఇప్పటికే వరి నారు సిద్ధం చేసుకున్న రైతులు, నాట్లు వేయడానికి పొలాలను దమ్ము పడుతున్నారు.

'తాండవ'కు జలకళ

- గరిష్ఠస్థాయికి చేరువలో నీటిమట్టం

నాతవరం, ఆగస్టు 29: తాండవ జలాశయంలోకి వరద ప్రవాహం కొనసాగుతున్నది. గురువారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 530 క్యూసెక్కులు వుండగా, ఆయకట్టుకు రెండు కాలువల ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 377.6 అడుగులు వుంది. మరోవైపు వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. కానీ ప్రధాన కాలువ మూడు గేట్లలో ఒక గేటుకు చెందిన రోప్ మూడు రోజుల క్రితం తెగిపోవడంతో షట్టర్ కిందకు దిగిపోయింది. దీంతో రెండు గేట్ల ద్వారానే కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. పొలాలను దమ్ము చేయడానికి ఎక్కువ నీరు అవసరం అవుతుందని, ఇటువంటి తరుణంలో గేటు మరమ్మతులకు గురై, కాలువలకు నీటి విడుదల తగ్గిపోవడంతో వరినాట్లు జాప్యం అవుతున్నాయని చివరి ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ఈ విషయాన్ని తాండవ ప్రాజెక్టు డీఈఈ అనురాధ దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా, గేటు మరమ్మతు పనులు జరుగుతున్నాయని, శుక్రవారం సాయంత్రంలోగా పనులు పూర్తవుతాయని చెప్పారు. దీంతో కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేస్తామన్నారు.

క్రైం... crime news

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


యకా ప్రేమ అంజి (ఫైల్ ఫొటో)

మాకవరపాలెం, ఆగస్టు 29: మండలంలో రామన్నపాలెం గ్రామానికి చెందిన ఒక యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామన్నపాలెం గ్రామానికి చెందిన యకా ప్రేమ అంజి(21) బుధవారం రాత్రి ఎనిమిది గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు అతని మొబైల్ ఫోన్‌కు కాల్ చేస్తే.. స్విచ్ఛాఫ్ అని వస్తున్నది. గురువారం ఉదయం కూడా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు తమ కుమారుడు అదృశ్యం అయ్యాడంటూ ప్రేమ అంజి తండ్రి రాజుబాబు గురువారం మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో ఎరకన్నపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కనున్న నేలబావిలో ప్రేమ అంజి మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఎస్.ఐ. రామకృష్ణారావు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని నేలబావిలో నుంచి బయటకు తీయించారు. మృతుని శరీరంపై ఎటువంటి గాయాలు లేకపోవడంతో అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్టు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. కాగా ప్రేమ అంజి డిగ్రీ పూర్తిచేశాడని, అల్యూమినియం కంపెనీలో ఇటీవల నిర్వహించిన ఉద్యోగ ఇంటర్వ్యూలో ఎంపికయ్యాడని, వచ్చే నెల నాలుగో తేదీన విధుల్లో చేరాల్సి వుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

చెట్టు పైనుంచి జారిపడి వ్యక్తి మృతి


మృతిచెందిన దుర్గారావు

చోడవరం, ఆగస్టు 29: పట్టణ శివారులోని గాంధీగ్రామంలో కొబ్బరిచెట్టు పైనుంచి పడి ఒక వ్యక్తి మృతిచెందాడు. గ్రామానికి చెందిన కోణాల దుర్గారావు(45) బుధవారం సాయంత్రం కొబ్బరికాయలు దించడం కోసం చెట్టు ఎక్కాడు. పైకి వెళ్లిన తరువాత పట్టుజారడంతో కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. కానీ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐ శేఖరం తెలిపారు.

విద్యుదాఘాతంతో ఈపీడీసీఎల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి


బోయిన రామరాజు (ఫైల్‌ఫొటో)

కొత్తూరు(అనకాపల్లి), ఆగస్టు 29: ఏపీఈపీడీసీఎల్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కరెంటు స్తంభంపై పనిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి మండలం మెట్టపాలెం పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన బోయిన రామరాజు (39) ఈపీడీసీఎల్‌లో ఔట్‌సోర్సింగ్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. మూడు రోజులుగా గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో మరమ్మతు పనులు చేస్తున్నారు. గురువారం ఉదయం కరెంటు స్తంభం ఎక్కి పనిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కిందకి పడిపోయాడన్నారు. దీనిని గమనించిన స్థానికులు హుటాహుటీన అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించినట్టు ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. మృతుడు భార్య భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. కాగా రామరాజుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కొణతాల పరామర్శ

అనకాపల్లి టౌన్: జగన్నాథపురంలో విద్యుదాఘాతానికి గురై గురువారం మృతిచెందిన బోయిన రామరాజు కుటుంబసభ్యులను ఎన్టీఆర్ వైద్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరామర్శించారు మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ ధర్నా


ఎన్టీఆర్ వైద్యాలయానికి ఎదురుగా రోడ్డుపై ధర్నా చేస్తున్న దృశ్యం

మృతి చెందిన రాజురాజు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు గురువారం సాయంత్రం ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట ధర్నా చేశారు రామరాజు కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ప్రభుత్వం రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలని ఆందోళకారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, సీపీఎం నాయకుడు గంటా శ్రీరామ్, సీపీఐ నాయకుడు రాజాన దొరబాబు, ఏఐటీయూసీ ప్రతినిధులు, మృతుడు కుటుంబసభ్యులు, బంధువులు పాల్గొన్నారు. దీంతో ఏపీఈపీడీసీఎల్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారని రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకురాలి మృతి

ఎస్.రాయవరం, ఆగస్టు 29: మండలంలోని అడ్డరోడ్డు వద్ద గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యాచకురాలు మృతి చెందినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. మృతురాలు స్థానికంగా యాచిస్తున్నదని, ఈమెను లక్ష్మి అని పిలుస్తారని చెప్పారు. ఆమె గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

దేవరాపల్లిలో భారీ చోరీ

- రూ.1.5 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం అపహరణ

దేవరాపల్లి, ఆగస్టు 29: స్థానిక బండారు వీధిలోని ఒక ఇంటిలో భారీ చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు రూ.1.5 లక్షల నగదు, నాలుగు తులాల బంగారాన్ని అపహరించుకుపోయారు. బాధితులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి.

దేవరాపల్లికి చెందిన గుల్లిపల్లి అచ్చిబాబు, భార్య తల్లిదండ్రులతో కలిసి బండారు వీధిలో నివాసం వుంటున్నారు. ఇతను స్థానికంగా ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నాడు. భార్య ఒక ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం అచ్చిబాబు స్టూడియోకు, భార్య పాఠశాలకు వెళ్లిపోయారు. తండ్రి అప్పలనాయుడు పొలం పనులకు వెళ్లగా, తల్లి నారాయణమ్మ కొద్దిసేపటి తరువాత ఇంటికి తాళం వేసి, తాళం చెవిని పక్క ఇంటి వారికి ఇచ్చి విశాఖ బయలుదేరి వెళ్లింది. బుచ్చిబాబు మధ్యాహ్నం వచ్చి, పక్కింటి వారి నుంచి తాళం చెవి తీసుకుని భోజనం చేశాడు. బ్యాంకు రుణం చెల్లించడానికి డబ్బుల కోసం కప్‌బోర్డు వద్దకు వెళ్లగా.. తలుపులు తీసి వున్నాయి. దీంతో ఆందోళన చెందిన అతను స్టీల్ బాక్సులో భద్రపరిచిన లక్షా 50 వేల నగదుతోపాటు సుమారు నాలుగు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	88.00
లైవ్ ధర	108.00
విత్ స్కిన్	186.00
స్కిన్ లెస్	196.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529


పాతకృష్ణాదేవిపేటలో రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులు, నిలిచిన వర్షం నీరు


పాత కృష్ణాదేవిపేటలో పూర్తిగా ఛిద్రమై, ఆనవాళ్లు లేని తారు రోడ్డు

రహదారులు ఛిద్రం

- వర్షాలతో మరింత అధ్వానం
- వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బందులు

కృష్ణాదేవి పేట, ఆగస్టు 29:
గొలుగొండ మండలంలో పాతకృష్ణాదేవిపేట, పల్లావూరు, ఏఎల్‌పురం, కొంగసింగి తదితర ప్రాంతాల్లో వెళ్లే రహదారులు గోతులమయంగా మారాయి. ఇప్పటికే అధ్వానంగా వున్న రోడ్లు.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మరింత దారు ణంగా తయారయ్యాయి. గోతుల్లో వర్షం నీరు చేరడంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నీరు నిలిచిన గోతులు ఎంత లోతు వున్నాయో అంచనా వేయలేక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళ్లలో కొత్తగా ఈ మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు ఎక్కడ గోతులు వున్నాయో తెలియక ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై గోతులు పూడ్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


కొంగసింగి వెళ్లే రహదారిలో గొయ్యి


సోమలింగపాలెం, రామారాయుడుపాలెం గ్రామాల మధ్య రోడ్డు కోతకు గురవ్వడంతో పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్, డీఈఈ

కోతకు గురైన రోడ్డు

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఎలమంచిలి, ఆగస్టు 29:
ఇటీవల కురిసిన వర్షాలకు మునిసిపాలిటీలోని సోమలింగపాలెం-రామారాయుడు గ్రామాల రోడ్డు కోతకు గురవ్వడంతో ప్రజల రాకపోకలకు కష్టమవుతోంది. ఈ రోడ్డు మీదుగా రామారాయుడుపాలెం నుంచి సోమలింగపాలెంలో హైస్కూలు చదువులకు వెళ్లే విద్యార్థులతోపాటు స్థానికులు అవస్థలు పడుతున్నారు. గురువారం ఇన్‌చార్జి కమిషనర్ ప్రభాకరరావు, డీఈఈ వీరయ్య కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. కోతకు గురైన రోడ్డు గురించి ఎమ్మెల్యే విజయకుమార్ దృష్టికి జనసేన పార్టీ ప్రతినిధి రూస్సీ తీసుకువెళ్లారు.

సీతాఫలాల ధర పతనం

- కోనాం సంతలో 50-60 కాయలున్న బుట్ట రూ.150-200
- 100-120 కాయలున్న కావిడి రూ.500-600
- గత వారంతో పోలిస్తే గిరిజనులకు దక్కింది సగం ధరే!

చీడికాడ, ఆగస్టు 29: మండలంలోని కోనాంలో గురువారం జరిగిన సంతకు ఏజెన్సీలోని పలు గ్రామాల నుంచి గిరిజనులు కావిళ్లు, బుట్టలతో సీతాఫలాలు తీసుకువచ్చారు. వర్షం కారణంగా మైదాన ప్రాంతం నుంచి వ్యాపారులు (కొనుగోలుదారులు) తక్కువ మంది వచ్చారు. దీంతో డిమాండ్ లేకపోవడంతో ధరలు పడిపోయాయి. ప్రతి గురువారంకోనాంలో జరిగే సంతకు చీడికాడతోపాటు పాడేరు. హుకుంపేట, అనంతగిరి మండలాలకు చెందిన వివిధ గ్రామాల గిరిజనులు అటవీ ఫలసాయ, వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం సీతాఫలాల సీజన్ కావడంతో సుదూరంలో వున్న గ్రామాల నుంచి నడుచుకుంటూ కావిళ్లు, బుట్టలతో సీతాఫలాలను మోసుకుంటూ ఉదయం ఏడు గంటల నుంచే సంతకు రావడం మొదలుపెట్టారు. అయితే వాతావరణం ముసురుగా వుండడం, చెదురుమదురుగా వర్షం పడుతుండడంతో సీతాఫలాలు కొనుగోలు చేయడానికి మైదాన ప్రాంతం నుంచి అనుకున్న మేర వ్యాపారులు రాలేదు. దీంతో 50 కాయలు ఉన్న బుట్ట, రూ.200 నుంచి రూ.250, అలాగే 100 నుంచి 120 కాయలు ఉన్న కావిడి రూ.500 నుంచి రూ.600 ధరలు పలికాయి. గత వారం 50 కాయలు ఉన్న బుట్ట రూ.300 నుంచి రూ.400 పలికిందని, ఈ వారం ధర సగానికి పడిపోయిందని గిరిజనులు వాపోతున్నారు. కొనుగోలుదారులు అరకొరగా రావడంతో, వారు అడిగిన ధరకు అమ్ముకోవాల్సి వచ్చిందని అంటున్నారు.


సీతాఫలాల బుట్టలు, కావిళ్లతో కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్న గిరిజన రైతులు

రైతులకు చేరువగా నూతన సాంకేతికత

- జిల్లా భూసార సంరక్షణ అసిస్టెంట్ డైరెక్టర్ మురళి

రాంబిల్లి, ఆగస్టు 29 : రైతులకు నూతన సాంకేతికతను చేరువ చేసేలా సమగ్ర వ్యవసాయ విధానాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా భూసార సంరక్షణ అసిస్టెంట్ డైరెక్టర్ కె.మురళి అన్నారు. గురువారం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రంలో 'ఆత్మ' సహకారంతో గ్రామీణ వ్యవసాయ సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంటల్లో సాంకేతిక అంశాలను రైతులకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి తులసీమణి పంటల సరళి, వివిధ దశల్లో వచ్చే మార్పుల గురించి తెలియజేశారు. సమగ్ర సస్యరక్షణ, పోషక యాజమాన్యం, భూసార పరిరక్షణ గురించి బీసీటీ కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు బి.శ్రీహరిరావు, డాక్టర్ వానాప్రసాద్‌రావు, బండి నాగేంద్రప్రసాద్ పవర్‌పాయిట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట అసిస్టెంట్ డైరెక్టర్ ఉమాప్రసాద్, నక్కపల్లి, పాయకరావుపేట, మాకవరపాలెం, కోటవురట్ల, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, ఎలమంచిలి మండలాల వ్యవసాయాధికారులు, 118 మంది గ్రామీణ వ్యవసాయ సంచాలకులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ ఉమాప్రసాద్, వ్యవసాయాధికారి తులసీమణి

విషాహార బాధిత విద్యార్థులకు ఆర్థిక సాయం

పాడేరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని ఒక అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై, ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న ఇద్దరు గిరిజన విద్యార్థులకు రూ.50 వేల చొప్పున చెక్కులను జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి గురువారం అందజేశారు. విషాహార బాధితులైన మర్రి రంజిత్, కొర్రా సుశాంతి అనే విద్యార్థులు సంపూర్ణంగా కోలుకోవడంతో గురువారం వారితోపాటు కుటుంబ సభ్యులను కలెక్టరేట్‌కు రప్పించి ఆర్థిక సాయం అందించారు. అనుమతిలేని వసతిగృహాల్లో పిల్లలను చేర్పించవద్దని డీఆర్‌వో పద్మావతి సూచించారు.


సాయం చెక్కులు అందుకున్న విద్యార్థులు, కుటుంబీకులతో డీఆర్‌వో పద్మావతి

పాము కాటుతో రైతు మృతి

కె.కోటపాడు, ఆగస్టు 29: పొలంలో పనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో రైతు మృతిచెందాడు. మండలంలోని దాలివలస గ్రామానికి చెందిన దమ్ము పెంటయ్య(50) గురువారం మధ్యాహ్నం భార్య, కుమారుడితో కలిసి పొలానికి వెళ్లాడు. ఏపుగా పెరిగిన తుప్పలు తొలగిస్తుండగా తుప్పల్లో నుంచి బయటకు వచ్చిన పాము, అతని చేతిపై కాటు వేసింది. దీంతో భార్య, కుమారుడు కలిసి వెంటనే కె.కోటపాడు ఆస్పత్రికి తీసుకువచ్చారు. కానీ అప్పటికే శరీరమంతా విషయం వ్యాపించడంతో వైద్యులు చికిత్స చేసినా ఫలితం లేకపోయింది. మృతుడి కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పోలీసులు ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

నాటి వైసీపీ పాలకుల నిర్లక్ష్యం.. రోగులకు శాపం

- ఆస్పత్రికి రోడ్డు వేయని అధికారులు
- చినుకుపడితే రోడ్డు చిత్తడే
- ఆస్పత్రికి వెళ్లేందుకు భయపడుతున్న రోగులు
- రోడ్డును ఆధునికరించాలని వేడుకోలు


చినుకు పడితే బురదగా ఉన్న ఆస్పత్రి రోడ్డు

ఎలమంచిలి, ఆగస్టు 29: గత వైసీపీ ప్రభుత్వ పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చినుకు పడితే చాలు ఆస్పత్రి రోడ్డు బురదమయం అవుతోంది. దీంతో ఆస్పత్రికి వెళ్లే రోగులు ఎక్కడ జారిపోతామోనని భయపడుతున్నారు. ఎలమంచిలి పట్టణంలో తులసీనగర్ వార్డులో రూ. రెండు కోట్లతో నూతనంగా ఆస్పత్రి భవనాలను నిర్మించారు. అయితే రహదారి నిర్మాణం చేయకుండా వదిలేశారు. దీంతో చినుకు పడితే చాలు రోడ్డు చిత్తడిగా మారి రోగులు ఆస్పత్రికి వెళ్లలేని విధంగా తయారవుతోంది. ప్రమాదకరంగా ఉన్న ఈ రోడ్డుపై నుంచే ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. అలాగే అక్కడికి సమీపంలోనే జగనన్న లేఅవుట్ ఉంది. ఇక్కడ రోడ్డు వేసినట్టయితే వారికి కూడా అనుకూలంగా ఉంటుంది. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి నిలువటద్దంగా ఉన్న ఈ రోడ్డు కూటమి ప్రభుత్వం హయాంలోనే ఆధునికీకరణకు నోచుకుంటుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు ప్రజలకు స్పీకర్ శుభాకాంక్షలు


అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఆగస్టు 29: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శాసనసభ స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు గురువారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలకు తెలుగు భాష ప్రతీకగా నిలుస్తూ విశ్వవ్యాప్తంగా ప్రత్యేకతను చాటుకుంటున్నదని పేర్కొన్నారు. మాతృ భాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. భాషా సాహిత్యాన్ని, సంస్కృతిని కాపాడుకోవడానికి తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విస్తృత ప్రచారం చేయాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ధీరజ్



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్, మెడల్స్‌తో ధీరజ్

నర్సీపట్నం, ఆగస్టు 29: సంపూర్ణ వందేమాతరం గీతాన్ని 77 సార్లు నిర్విరామంగా ఆలపించినందుకు నర్సీపట్నం ప్రాంతానికి చెందిన 'పాడుతా తీయగా..' విన్నర్ దొంతంశెట్టి ధీరజ్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించాడు. ఈ ఏడాది మార్చి 20వ తేదీన స్థానిక శ్రీసత్యసాయి మందిరంలో లైవ్‌లో సంపూర్ణ వందేమాతరం గీతాన్ని పాడాడు. ప్రస్తుతం పాడుతా తీయగా మహా సంగ్రామంలో పాటలు పాడుతున్నాడు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ధీరజ్‌ని అభినందించారు.

వేములపూడి పీబీఎం జడ్పీ ఉన్నత పాఠశాలకు ఉత్తమ క్రీడా పురస్కారం

- 189 పాయింట్లతో జిల్లాలో మొదటి స్థానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

నర్సీపట్నం, ఆగస్టు 29: వేములపూడి పీబీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉత్తమ క్రీడా పురస్కారం లభించింది. గురువారం నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా అనకాపల్లి జీవీఎంసీ హైస్కూల్లో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొనతాల రామకృష్ణ చేతుల మీదుగా హెచ్ఎం, ఉపాధ్యాయులు అవార్డు అందుకున్నారు. పాఠశాల నుంచి 32 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో, ఆరుగురు విద్యార్థులు జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. 189 పాయింట్లతో జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో నిలవడంతో క్రీడా పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటలక్ష్మమ్మ, శాప్ కోచ్ రమణ, హెచ్ఎం గుడివాడ రమణ, ఉపాధ్యాయులు డి.రవి, పి.సుమన్ పాల్గొన్నారు.

ఐటీ రాజధానిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

పట్టించుకోలేదని, ప్రభుత్వ పెద్దలు తమను ఏనాడూ దగ్గరకు రానివ్వలేదని, ఇప్పుడు పరిస్థితులు మారినందుకు చాలా సంతోషంగా ఉందని పలువురు పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తంచేశారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, ఐటీ సమస్యల పరిష్కారానికి ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ఐటీ పరిశ్రమలకు రాయితీపై భూములు ఇవ్వాలని పలువురు కోరినందున దీనిపై మంత్రివర్గంలో చర్చిస్తాన్నారు. విద్యుత్, ఇతర పన్నుల భారాలపై సమీక్షించి నిర్ణయం తీసుకుంటామన్నారు. విశాఖకు పెద్ద సంఖ్యలో విమానాలు రావాలంటే నైట్ పార్కింగ్ చార్జీలు తగ్గించాలని సింబియోసిస్ సీఈఓ నరేశ్ కోరగా, కేంద్ర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడితో చర్చిస్తామన్నారు. అంతర్జాతీయ విమానాలు వచ్చేలా ప్రయత్నిస్తామని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో తెలుగువారు ఎక్కువగా ఉన్నారని, గత ప్రభుత్వ హయాంలో పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన వారిని వెనక్కి రప్పిస్తామని లోకేశ్ అన్నారు. అందుకు అనుగుణంగా ఐటీ స్పేస్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఐటీ రంగంలో ఇంకుబేషన్, కమ్యూనికేషన్స్ పెంచుతామన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను కూడా ప్రోత్సహిస్తామన్నారు. కేవలం ఐటీనే కాకుండా ఫార్మా, ఎంఎస్ఎంఈ రంగాల్లోను విశాఖపట్నం అభివృద్ధి చెందుతున్నదని, వారిని కూడా ప్రోత్సహిస్తామన్నారు. యువతలో నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ సెన్సస్ కార్యక్రమం చేపట్టబోతున్నామన్నారు. టాప్ 100 యూనివర్సిటీల్లో ఏపీ యూనివర్సిటీలు ఉండాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు.

విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ, విశాఖకు విమానాల సంఖ్య పెంచాలని, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఐటీ పరిశ్రమలకు సెక్యూరిటీ, ట్రాన్స్‌పోర్టు, హైస్పీడ్ ఇంటర్నెట్ వంటివి కల్పించడం ద్వారా ఎకో సిస్టమ్ వృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీ చీఫ్ సెక్రటరీ సౌరభ్ గౌర్ తదితరులు పాల్గొన్నారు. బెంగళూరులో ఐటీ సంస్థలు నిర్వహిస్తున్న పది మంది విశాఖ పారిశ్రామికవేత్తలు ఈ సమావేశానికి ప్రత్యేకంగా రావడం గమనార్హం.


అనకాపల్లి జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో గిడుగు చిత్రపటం వద్ద ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నివాళులు


కశింకోట మండలం తాళ్లపాలెం పాఠశాల విద్యార్థినీ విద్యార్థుల కవులు, కవయిత్రిల వేషధారణలు


అచ్యుతాపురంలోని ఓ పాఠశాలలో తెలుగు తల్లి వేషధారణలో ఆకట్టుకుంటున్న విద్యార్థిని..., చిన్నారుల నృత్యాల


ఎస్.రాయవరం మండలం ధర్మవరం అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద ఉపాధ్యాయుల నివాళి

విద్యాలయాల్లో తెలుగు వెలుగులు

▸▸ ఘనంగా తెలుగు భాషా దినోత్సవం ▸▸ గిడుగు ఖ్యాతిని కీర్తించిన వక్తలు ▸▸ వివిధ వేషధారణలతో వేడుకకు వన్నెతెచ్చిన విద్యార్థులు


ఎలమంచిలి మండలం పురుషోత్తపురం జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వివిధ వేషధారణలతో అలరిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు


కలెక్టరేట్‌లో గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

తుమ్మపాల, ఆగస్టు 29: తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తి గిడుగు వెంకట రామ్మూర్తి అని జాయింట్ కలెక్టర్ జాహ్నవి పేర్కొన్నారు. గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రాంథికంలో ఉన్న తెలుగును వాడుక భాషలోకి తీసుకువచ్చి రచనలు చేసి భాషా సౌందర్యాన్ని ఇనుమడింపజేసిన వ్యక్తి రామ్మూర్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో బి. దయానిధి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : జీవీఎంసీ పట్టణ బాలికోన్నత పాఠశాలలో మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయిని రుధిర రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుమ్మపాల : ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా విద్యార్థులకుపోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూలులో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్ఎం ఆచంట రవి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : తెలుగు భాషా దినోత్సవాన్ని ఇక్కడ ఘనంగా నిర్వహించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గిడుగు చిత్రపటానికి పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ వేడుకలు జరిగాయి.

నక్కపల్లి : మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెదబోదిగల్లం, ఉద్దండపురం, వేంపాడు, గొడిచెర్ల, జానకయ్యపేట, రాజయ్యపేట, దేవవరం, నక్కపల్లి హైస్కూళ్లల్లో ఆయా హెచ్ఎంల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. హెచ్ఎంలు చోడిశెట్టి సత్యనారాయణ, సత్యారావు, తెలుగు పండిట్ ఎస్‌వీఎస్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : ధర్మవరం అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా గిడుగు రామ్మూర్తిపంతులు, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం బి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో ఈ వేడుకలను జరిపారు.

కోటవురట్ల : తెలుగు భాష దినోత్సవాన్ని కోటవురట్ల మండలం రాజుపేట యూపీ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష గొప్పతనాన్ని ఉపాధ్యాయులు ఆర్‌డీవీ ప్రభాకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : తెలుగు భాషా దినోత్సవాన్ని మండలంలోని పురుషోత్తపురం జడ్పీ హైస్కూల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత టీడీపీ జిల్లా నాయకుడు కొలుకులూరి విజయ్‌బాబు, పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ విఘ్నేశ్వరిలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. హెచ్ఎం శోభారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వక్తలు, పాఠశాల ఉపాధ్యాయులు తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులు తెలుగు తల్లి, పాండవులు, గిడుగు రామ్మూర్తి పంతులు వంటి మహనీయుల వేషధారణలతో విశేషంగా ఆకట్టుకున్నారు. అలాగే, ఈ వేడుకల్లో భాగంగా జంపపాలెం జడ్పీహైస్కూల్ విద్యార్థులు అ..ఆ.. అక్షర మాలలో వేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. హెచ్ఎం శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : తెలుగు భాషా దినోత్సవాన్ని హరిపాలెం ఉన్నత పాఠశాల, అచ్యుతాపురం విశాఖ పబ్లిక్ స్కూల్‌తో పాటు పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాలల్లో విద్యార్థులు కవుల వేషధారణలో అలరించారు.

మునగపాక : తెలుగు భాష వైభవానికి కృషి చేసిన మహనీయుడు గిడుగు రామమూర్తి పంతులు అని పాటిపల్లి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పీలా ఆశా అన్నారు. పాఠశాలలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు, తెలుగులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేసి సత్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని పలు పాఠశాలల్లో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో తెలుగు భాష గొప్పతనంపై విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, పాఠశాల సీఈవో కె.నిశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే, వాడచీపురుపల్లి హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత గిడుగు రామ్మూర్తి పంతులు, హాకీ మాంత్రికుడు ధ్యానచంద్ చిత్రపటాలకు హెచ్ఎం కనకేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

సబ్బవరం : తెలుగు భాష అమ్మలాంటిదని ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అన్నారు. మాతృభాష దినోత్సవాన్ని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఆమె వివరించారు. ఈ కార్యక్రమంల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా మర్రి చెట్లు కూల్చివేత


ఎరుకునాయుడుపాలెం వద్ద కూల్చివేసిన మర్రి చెట్లు

సబ్బవరం, ఆగస్టు 29: మండలంలోని అసకపల్లి- లంకెలపాలెం మధ్య రోడ్డుపై ఎరుకు నాయుడుపాలెం వద్ద భారీ మర్రి వృక్షాలను ఎటు వంటి అనుమతులు లేకుండా కొంతమంది కూల్చివేశారు. చిన్న చెట్టు తొలగించాలంటే రెవెన్యూ, ఫారెస్టు అధికారుల అనుమతులు ఉండాలి. అటువంటిది ఆర్అండ్‌బీకి చెందిన భారీ వృక్షాలు కూల్చి వేసినా సంబంధిత అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ కృష్ణారావు వద్ద ప్రస్తావించగా.. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, తనకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో సెలవు పెట్టానన్నారు. ఈ విషయమై వీఆర్వోకు సమాచారం ఇవ్వడం జరిగిం దన్నారు. వీఆర్వో ఇచ్చిన సమాచారం మేరకు దర్యాప్తు చేసి చెట్లు కొట్టేసినవారిపై చర్యలు తీసుకుంటానన్నారు.

అనకాపల్లిని పారిశ్రామికంగా తీర్చిదిద్దండి : సీపీఎం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 29 : అనకాపల్లిని పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన అనకాపల్లి పారిశ్రామికంగా వెనుకబడి ఉందన్నారు. మండలంలోని వల్లూరు, రాజుపాలెం, ఎరుకువానిపాలెం తదితర గ్రామాలతో పాటు పరవాడ మండలం తాడిలో గతంలో లాజిస్టిక్ హబ్ పేరుతో సుమారు మూడు వేల ఎకరాల భూమి సేకరించారని, వాటిలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు రుత్తల శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా నియామకం

... 5వ పేజీ తరువాయి

ఆర్డీవో హెచ్‌వీ జయరాం స్థానంలో 2022 బ్యాచ్‌కి చెందిన కేఆర్ కల్పశ్రీని సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ గత ఆదివారం ఉత్తర్వులు వెలువడిన విషయం తెలిసింది. శిక్షణ పూర్తి చేసుకొని మొదటి పోస్టింగ్ నర్సీపట్నం సబ్‌కలెక్టర్‌గా ఆమె విధుల్లోకి చేరకముందే రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

జల వనరులకు పూర్వ వైభవం!

... 5వ పేజీ తరువాయి

సక్రంగా అందేది. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి రంగం పూర్తిగా నిర్వీర్యమైంది. సాగునీటి సంఘాలకు ఒక్కసారి కూడా ఎన్నికలు నిర్వహించలేదు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు లేకపోవడంతో సాగునీటి వనరులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఐదేళ్లపాటు జలవనరుల శాఖకు చెందిన జేఈ, ఏఈ, డీఈఈ, ఎస్ఈ స్థాయి అధికారులే కమిటీల స్థానంలో ప్రత్యేకాధికారులుగా వ్యవహరించే విధంగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అటు కమిటీలు లేక, ఇటు ప్రత్యేకాధికారులుగా కొనసాగుతున్న ఇంజనీరింగ్ అధికారులు సాగునీటి వనరుల నిర్వహణ పనులను పట్టించుకోలేదు. జలాశయాల ఆధునికీకరణ, చెరువులు, పంట కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టకపోవడంతో ఆయకట్టు భూములకు సరిగా నీరు అందక రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి సాగునీటి వనరులకు పూర్వ వైభవం తేవాలనే నిర్ణయించింది. దీనిని పార్టీలకు అతీతంగా రైతులంతా స్వాగతిస్తున్నారు.

వైభవంగా మరిడిమాంబ జాతర


పరవాడలో అమ్మవారు


వమ్మవరంలో మహాలక్ష్మి

కోటవురట్ల, ఆగస్టు 29 : మండల కేంద్రం కోటవురట్ల వరహా నది ఒడ్డున మరిడిమాంబ జాతర గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వైస్ ఎంపీపీ సాగి సీతాబాబు, జనసేన సీనియర్ నాయకులు గెడ్డం బుజ్జి, తోట నగేష్, జడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి, ఎంపీటీసీ పి.సూర్యారావు, టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, పి.బాబ్జి, వరహాలబాబు, జానకి హరిబాబు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పురవీధుల్లో మేళతాళాలు, బాజా భజంత్రీలు, డబ్బు డ్యాన్స్‌లు, శక్తివేషాలు వంటి వాటితో ఊరేగించారు. దారిపొడవునా భక్తులు దర్శించుకున్నారు.

పరవాడ : మండల కేంద్రం పరవాడలో మరిడిమాంబ పండగ గురువారం వైభవంగా జరిగింది. ఉదయం ఆరు గంటల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ నిర్మాణదాత కుటుంబీకులు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, కూటమి నాయకులు పైలా సన్యాసిరావు, రెడ్డి శ్రీనివాసరావు, పైలా చినఅక్కునాయుడు, పైలా రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మ వారి ఘటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించి, అనుపోత్సవం నిర్వహించారు.


కోటవురట్లలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

వమ్మవరంలో మహాలక్ష్మి అమ్మవారి పండగ

ఎస్.రాయవరం, ఆగస్టు 29 : మండలంలోని వమ్మవరంలో మహాలక్ష్మి అమ్మవారి జాతరను గురువారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మేళతాళాలు, బాజాభజంత్రీలు, శక్తివేషాలు, కోలాటాలతో గ్రామం అంతా సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో టీడీపీ, వైసీపీ నాయకులు పల్లెల జగ్గారావు, గొంతిన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు పసుపు, కుంకుమ సమర్పణ


అమ్మవారికి పసుపు, కుంకుమను తీసుకు వచ్చిన సభ్యులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 29 : శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మకు ఆలయాల నిర్వాహకులు గురువారం పసుపు, కుంకుమలను సమర్పించారు. ఏటా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఇక్కడి సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, గౌరీ పరమేశ్వరి కమిటీ, మరిడిమాంబ అమ్మవారి కమిటీ ప్రతినిధులు ఈ ఏడాది కూడా నూకాంబిక అమ్మవారికి, కనకదుర్గమ్మ అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించారు.

కోదండరామ ఆలయ వార్షికోత్సవం

కొత్తూరు, ఆగస్టు 29 : పిసినికాడ పంచాయతీ రామభద్రపురం కాలనీలో కోదండ రామస్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శించుకున్నారు.

నక్కపల్లి ఆస్పత్రిని తనిఖీ చేసిన డీసీహెచ్

నక్కపల్లి, ఆగస్టు 29 : ఇక్కడి యాభై పడకల ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్నం ఆస్పత్రిలో రోగులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్యసేవలు ఏవిధంగా అందుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. ఓపీ సంఖ్య పెరుగుతోందని సూపరింటెండెంట్ డాక్టర్ శిరీషా ఆయనకు వివరించారు. ఇటీవల ఆర్థోపెడిక్ కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి, రాష్ట్రంలోనే నక్కపల్లి ఆస్పత్రికి గుర్తింపు తెచ్చారంటూ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవికిరణ్‌ను అభినందించారు. ఆయన వెంట ఇమామ్ తదితరులు ఉన్నారు.

నేషనల్ ఆన్‌లైన్ యోగా పోటీల్లో అన్నదమ్ముల ప్రతిభ


భరద్వాజ్, ఆదిత్య రుత్విక్

నక్కపల్లి, ఆగస్టు 29 : ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 23 నుంచి 25 వరకు కర్ణాటక బీకేఎస్ అయ్యంగార్ ఎనిమిదో మెమోరియల్ నిర్వహించిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో నక్కపల్లి మండలం ఉపమాక గ్రామానికి చెందిన సోదరులు అద్భుత ప్రతిభ చూపారు. 20 నుంచి 25 ఏళ్ల విభాగంలో దవరసింగి భరద్వాజ్, 12 నుంచి 15 ఏళ్ల విభాగంలో దవరసింగి ఆదిత్య రుత్విక్ తృతీయ స్థానం సాధించినట్టు గురువారం నిర్వాహకుడు పుల్లేటి సతీశ్ విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని గ్రామస్థులు అభినందించారు.

క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు

▸▸ ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, ఆగస్టు 29 : క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రమణ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ బాలికోన్నత పాఠశాలలో ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యానచంద్ చిత్రపటం వద్ద ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులతో ప్రారంభమైన ర్యాలీ నెహ్రూచౌక్ వరకు చేరుకుని మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం కొణతాల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యాయామం, యోగాపై దృష్టి సారిస్తే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునన్నారు. క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ రోజులో అర గంటసేపు వ్యాయామం, యోగాకు సమయం కేటాయిస్తే భవిష్యత్తులో లక్ష్యాలు సాధించుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో రాణించిన వారిని ఎమ్మెల్యే సత్కరించారు. అలాగే వ్యాయామ ఉపాధ్యాయులను, స్కూల్ ప్రధానోపాధ్యాయులను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వైకే ప్రతినిధి మహేష్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధి మోటూరి నాగేశ్వరరావు, కేఎం నాయుడు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలపై ఫిర్యాదులు

సబ్బవరం, ఆగస్టు 29 : అసకపల్లిలోని ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించాలని కోరుతూ సర్పంచ్ కర్రి నర్సింగరావు, గ్రామానికి చెందిన చింతల త్రినాథ్ రెవెన్యూ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 164లో సుమారు 60 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఇందులో సుమారు ఇరవై సెంట్ల స్థలంలో స్థానిక నేతల సహకారంతో నాలుగు షెడ్లు నిర్మించారని ఆరోపించారు. దీనిపై వీఆర్‌వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అలాగే, పైడిబందకు అనుకొని ఉన్న సర్వే నెంబరు 162/20,21,22లలో ప్రభుత్వ భూమిని స్థానికులు కొంత మంది ఆక్రమించుకున్నట్టు పేర్కొన్నారు. అధికారులు సర్వే జరిపి, ఆక్రమణలను తొలగించాల్సిందిగా విన్నవించారు.

బీమా పాలసీలపై జీఎస్టీ రద్దుకు ఆందోళన

కొత్తూరు, ఆగస్టు 29 : బీమా పాలసీలపై జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా అనకాపల్లి బ్రాంచి ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. బీమా కార్యాలయం వద్ద గురువారం జరిగిన ఈ ఆందోళనలో ఏవోఐ ప్రధాన కార్యదర్శి కరణం మాణిక్యాలరావు, ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు జేవీఎస్ శాస్త్రి, ఆడారి శ్రీనివాసరావు, కన్నయ్యశాస్త్రి పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా దేవన్న

పాయకరావుపేట, ఆగస్టు 29 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రేపల్లి దేవన్న నియమితులయ్యారు. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న రవిశంకర్‌నాయక్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే.

తల్లి గౌరవార్థం అంతా మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న బీటీసీ కేవీకే చైర్మన్, సిబ్బంది

రాంబిల్లి, ఆగస్టు 29 : తల్లి గౌరవార్థం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బీటీసీ కృషి విజ్ఞాన కేంద్రం చైర్మన్ బి.శ్రీరామ్మూర్తి అన్నారు. తద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని కోరారు. మండలంలోని హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం క్షేత్రంలో సిబ్బంది గురువారం మొక్కలు నాటిన సందర్భంగా మాట్లాడారు. పచ్చదనం పెంపునకు అంతా కంకణబద్ధులు కావాలని కోరారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజా కుర్రా, శాస్త్రవేత్తలు నాగేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హీరో నాగార్జున జన్మదినం


కేకును కట్ చేస్తున్న అభిమానులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 29 : ఇక్కడి సత్యనారాయణ థియేటర్‌లో గురువారం ప్రముఖ సినీ హీరో అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. నాగార్జున ఉత్తరాంధ్ర ఫ్యాన్స్ అధ్యక్షుడు మళ్ల సురేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో తొలుత కేకు కట్‌చేసి అందరికీ పంచారు. ఎన్నో ఏళ్లగా అక్కినేని ఫ్యాన్స్‌కు సేవలందిస్తున్న అక్కినేని కుటుంబ సీనియర్ అభిమాని సీహెచ్.అవతారంను మళ్ల సురేంద్ర సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొణతాల పూర్ణచంద్రరావు, బుద్ధ అప్పారావు, పోలవరపు త్రినాథ్, గోల్డ్ వాసు, పొలమరశెట్టి చందు, యల్లపు శ్రీనివాసరావు, నంద్యాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం


అనకాపల్లి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ధ్యానచంద్ చిత్రపటం వద్ద నివాళులు


క్రీడాకారుల సత్కార సభలో మాట్లాడుతున్న దాడి రత్నాకర్

కొత్తూరు, ఆగస్టు 29 : పట్టణంలోని గవరపాలెం రైతుభారతి కల్యాణ మండపంలో ధ్యాన్ చంద్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. నేషనల్ బాడీ బిల్డర్ శిలపరశెట్టి బాబీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ హాజరై మాట్లాడారు. అనంతరం జిల్లాలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించిన పలువురు క్రీడాకారులను సన్మానించారు. క్రీడా ప్రతినిధులు ఎం.వి.మాణిక్యాలు, బి.వెంకటరామయ్య, ఎం.నారాయణరావు, కె.సూర్యనారాయణ, సకల కోటేశ్వరరావు, నాయుడు, ఎల్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధ్యాన్ చంద్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు పూలమాల వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుమ్మపాల : అనకాపల్లి మండలం మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయిని లంబా గౌరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: హాకీ మాంత్రికుడు ధ్యానచంద్ జయంతి సందర్భంగా హరిపాలెం ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు హెచ్ఎం శ్రీపాద రవి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ డి.రాజుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డిప్యూటీ డీఈవో అప్పారావు అన్నారు. గురువారం మునిసిపాలిటీ పరిధి తులసీనగర్‌లోని శ్రీగౌరీ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎంఈవో అరుణ్‌కుమార్, జంపపాలెం పాఠశాల హెచ్ఎం శాస్త్రి, స్కూల్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్బవరం: ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి బహుమతులు అందజేశారు. అనంతరం జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చూపిన డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థిని పి.విజయలక్ష్మి ప్రిన్సిపాల్, అధ్యాపకులు సత్కరించారు.

నర్సీపట్నం నియోజకవర్గం

భక్తిశ్రద్ధలతో మరిడిమాంబ పండగ



ఆలయం వద్ద భక్తుల కోలాహలం

కృష్ణాదేవిపేట, ఆగస్టు 29 : గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం, సీహెచ్ నాగాపురం, గైరంపేట గ్రామాల్లో మరిడిమాంబ అమ్మవారి పండగలను గురువారం ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో అమ్మవారికి ఆలయం వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లో అమ్మవారి ఘటాలు, భోనాలను ఊరేగిస్తూ పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, టీడీపీ నాయకులు చిట్టిబాబు, బొడ్డు జమీలు, లగుడు రమేష్, అప్పల నాయుడు, సన్నిబాబు, బొప్పన ప్రసాద్, మారిడిమాంబ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

టేకు ప్లాంటేషన్‌లో తనిఖీలు



ప్లాంటేషన్ తనిఖీ చేస్తున్న రేంజర్ లక్ష్మీనర్సు

నర్సీపట్నం, ఆగస్టు 29 : నాతవరం సెక్షన్ కృష్ణాపురం, అచ్చంపేట ప్లాంటేషన్‌లలో అక్రమంగా టేకు చెట్లు నరికి తరలించినట్టు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం తనిఖీ చేసినట్టు నర్సీపట్నం రేంజ్ అధికారి లక్ష్మి నర్సు తెలిపారు. అచ్చంపేట ప్లాంటేషన్‌లో డిప్యూటీ రేంజ్ అధికారి, కృష్ణాపురం ప్లాంటేషన్‌లో రేంజ్ అధికారి సిబ్బందితో కలిసి తనిఖీ చేశారని తెలిపారు. అయితే రెండు ప్లాంటేషన్‌లలో అక్రమంగా చెట్లు నరికినట్టు ఎటువంటి ఆధారాలు లేవని తెలిపారు.

వినాయక విగ్రహాల తయారీలో కళాకారులు బిజీ

- కొనుగోలుకు పలు ప్రాంతాలకు చెందిన వారు రాక
- గతం కంటే పెరిగిన ధరలు



విగ్రహాల తయారీలో నిమగ్నమైన కళాకారులు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 29 : వినాయక చవితి సమీపిస్తుండటంతో వినాయక విగ్రహాల తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు. సెప్టెంబరు 7న వినాయకచవితి పండగను పురష్కరించుకొని గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట (ఏఎల్‌పురం)లో గత 13 ఏళ్లుగా తంగేటి అప్పలనర్సయ్య, భార్య వెంకటలక్ష్మి, తంగేటి శ్రీను, నాగమణి, దేవారపు శంకర్రావు తదితర కళాకారులు విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఆరు అంగులాలు మొదలకొని 12 అడుగులు వరకు భారీ విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఈ ఏడాది రూ.20 నుంచి రూ. 15వేలకు పైబడి విగ్రహాలు విక్రమానికి సిద్ధం చేస్తున్నారు. ఈ విగ్రహాలను కొనుగోలు చేసేందుకు విశాఖ, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ తదితర జిల్లాలకు చెందిన పలువురు వ్యాపారులు హోల్‌సేల్‌గా తీసుకొని వారి ప్రాంతాల్లో అమ్మకాలు సాగిస్తుంటారు. గత ఏడాది కంటే రంగులు ధరలు పెరగటంతో విగ్రహాలు ధరలు పెరిగినట్లు కళాకారులు చెబుతున్నారు. కాగా పాతకృష్ణాదేవిపేట, చోద్యం, సీహెచ్ నాగాపురం, మల్లంపేట, గొలుగొండ, జోగంపేట తదితర గ్రామాల ప్రజలు ఇప్పటికే ముందుగా భారీ విగ్రహాలను అడ్వాన్స్ ఇచ్చి విగ్రహాలను బుక్ చేసుకున్నారు. దీంతో చిన్న, పెద్ద చురుగ్గా విగ్రహాలను రూపొందిస్తున్నారు. అలాగే వారం రోజులకు ముందుగానే ఈ పరిసర ప్రాంతాల్లో రోడ్లపై విగ్రహాలు అమ్మకాలు సాగిస్తుంటారు.

విద్యా సంస్థల్లో తెలుగు భాషా దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కుమార్



ధ్యాన్‌చంద్, గిడుగులకు నివాళులు అర్పిస్తున్న టీచర్లు

నర్సీపట్నం, ఆగస్టు 29 : తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజు గిడుగు వెంకటరామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ కుమార్ చేతుల మీదుగా వ్యాసచన పోటీలలో విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎన్ఎస్ కృష్ణ, తెలుగు అధ్యాపకులు డాకర్ ఎం.ధర్మారావు గిడుగు జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. నర్సీపట్నం శాఖా గ్రంథాలయ అధికారిని దమమంతి ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. జెడ్పీహెచ్ స్కూల్ తెలుగు టీచర్ ఎల్. శ్యామల గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన జీవిత విశేషాలు తెలియజేశారు.

గొలుగొండ : మండలంలోని చీడిగుమ్మల, గొలుగొండ, కొత్తయల్లవరం, పాకలపాడు, గుండుపాల, కొత్తమల్లంపేట, జోగింపేట, ఏఎల్‌పురం, చోద్యం హైస్కూల్స్‌లో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చీడిగుమ్మల హైస్కూల్‌లో తెలుగుభాషా, క్రీడాదినోత్సవాన్ని పురష్కరించుకుని తెలుగుభాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పుష్పాభిషేకం నిర్వహించి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థినితో తెలుగుతల్లి వేషధారణ, విద్యార్థులు పద్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు నాగభూషణం, రమణ, ఉపాధ్యాయులు టీవీ రమణ, రామరాజు, లోచల రమేష్, దేముడు, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : మండలంలో పలు చోట్ల తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక అవంతి కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వ్యవహారిక ఉద్యమ నాయకుడు గిడుగు వెంకటరామమూర్తికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు మాట్లాడుతూ మాతృభాష మన సంస్కృతీసంప్రదాయాలను ప్రతిబింబిస్తుందన్నారు. అనంతరం తెలుగు భాషా పండితుడు సుబ్బారావును ఘనంగా సత్కరించారు. అలాగే కస్తూర్బా పాఠశాలలో కస్తూర్బా ప్రత్యేక అధికారి త్రివేణి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



తెలుగు భాషా పండితుడు సుబ్బారావును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు

భవనం పరిశీలన

మాకవరపాలెం, ఆగస్టు 29 : మండల కేంద్రంలోని తార స్వచ్ఛంద సంస్థ భవనాన్ని ఆర్డీవో జయరాం పరిశీలించారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న తార స్వచ్ఛంద సంస్థ ఆధీనంలో ఉన్న భవనంలో చాలా కాలం నుంచి ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించడం లేదు. దీంతో ఈ భవనాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇటీవల మాకవరపాలెంలో జరిగిన గ్రామసభలో ఆర్డీవోకు సూచించారు. భవనం తొలగించి కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్పీకర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో గురువారం భవనాన్ని పరిశలించి దానిని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఆర్డీవో వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

నాతవరం, ఆగస్టు 29 : నాతవరం మండలం చినగొలుగొండపేట ప్రాథమికోన్నతపాఠశాలలో గురువారం కౌమర బాలికలకు సరైన వయస్సులో వివాహం అన్న అంశంపై అవగహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సంద్భంగా గుణుపూడి వైద్యాదికారి అనూష్ పలు విషయాలను వివరించారు.

సమస్యల పరిష్కారం కోసం టీడీపీ నేతల వినతి



మునిసిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

నర్సీపట్నం, ఆగస్టు 29 : మునిసిపాలిటీలో అధ్వానంగా ఉన్న పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు కమిషనర్‌ని కోరారు. కొత్తగా విధుల్లో చేరిన కమిషనర్ జె.సురేంద్రని గురువారం మర్యాదపూర్వంగా కలిశారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మునిసిపాలిటీని పట్టించుకోలేదన్నారు. వార్డులలో పారిశుధ్య సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ గతంలో మూడేళ్లు పని చేసిన అనుభవం ఉందని, ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు డబ్బీరు శ్రీకాంత్, ధనిమిరెడ్డి మధు, రాజుల నాయుడు, టీడీపీ నాయకులు పెదిరెడ్ల చింతు, లాలం మురళీకృష్ణ, పైల గోవింద్, రుత్తల కృష్ణ, నాగేంద్రరాజు, జె.రాజ్‌కుమార్, రుత్తలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

మాకవరపాలెం, ఆగస్టు 29 : మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన క్రీడా పిరమిడ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు, హాకీ క్రీడా మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌కు నివాళులు అర్పించారు. అనంతరం హెచ్ఎం కోసూరు రాము మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. అప్పుడు వికాసం పెంపొందుతుందన్నారు. అలాగే అవంతి కళాశాలలో క్రీడా దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

నర్సీపట్నం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా నియామకం

... 5వ పేజీ తరువాయి

ఆర్డీవో హెచ్‌వీ జయరాం స్థానంలో 2022 బ్యాచ్‌కి చెందిన కేఆర్ కల్పశ్రీని సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ గత ఆదివారం ఉత్తర్వులు వెలువడిన విషయం తెలిసింది. శిక్షణ పూర్తి చేసుకొని మొదటి పోస్టింగ్ నర్సీపట్నం సబ్‌కలెక్టర్‌గా ఆమె విధుల్లోకి చేరకముందే రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

జల వనరులకు పూర్వ వైభవం!

... 5వ పేజీ తరువాయి

సక్రమంగా అందేది. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి రంగం పూర్తిగా నిర్వీర్యమైంది. సాగునీటి సంఘాలకు ఒక్కసారి కూడా ఎన్నికలు నిర్వహించలేదు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు లేకపోవడంతో సాగునీటి వనరులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఐదేళ్లపాటు జలవనరుల శాఖకు చెందిన జేఈ, ఏఈ, డీఈఈ, ఎస్ఈ స్థాయి అధికారులే కమిటీల స్థానంలో ప్రత్యేకాధికారులుగా వ్యవహరించే విధంగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అటు కమిటీలు లేక, ఇటు ప్రత్యేకాధికారులుగా కొనసాగుతున్న ఇంజనీరింగ్ అధికారులు సాగునీటి వనరుల నిర్వహణ పనులను పట్టించుకోలేదు. జలాశయాల ఆధునికీకరణ, చెరువులు,పంట కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టక పోవడంతో ఆయకట్టు భూములకు సరిగా నీరు అందక రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి సాగునీటి వనరులకు పూర్వ వైభవం తేవాలనే నిర్ణయించింది. దీనిని పార్టీలకు అతీతంగా రైతులంతా స్వాగతిస్తున్నారు.

చోడవరం నియోజకవర్గం

ఐతంపూడి ఎస్ఎంసీ చైర్‌పర్సన్‌గా సరస్వతి

బుచ్చెయ్యపేట, ఆగస్టు 29 : మండలంలోని ఐతంపూడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా ఐతరెడ్డి సరస్వతి, వైస్ చైర్మన్‌గా కొమ్ము జ్యోతి ఎన్నికయ్యారు. ఈ నెల 17న జరగాల్సిన ఈ ఎన్నికలు వాయిదా పడగా, హెచ్ఎం శ్రీనివాస్ అధ్వర్యంలో గురువారం నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులను సర్పంచ్ పెద్దాడ నాయుడు అభినందించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు.

31న నాలుగు పాఠశాలల్లో ఎన్నికలు

ఇదిలావుంటే, ఈనెల 31వ తేదీ శనివారం మండలంలోని నాలుగు పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎంఈవో బి.కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. వడ్డాది కేజీబీవీ స్కూల్, సీతయ్యపేట జడ్పీ హైస్కూల్, కొత్త కొండెంపూడి, పెదపూడి ఎంపీఈపీలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

వాహనాలు నడుపుతున్న మైనర్లపై కేసులు



ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ప్రశ్నిస్తున్న ఎస్ఐ

రావికమతం, ఆగస్టు 29 : ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ఐదుగురు మైనర్లపై కేసు నమోదు చేశామని కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. స్టేషన్ పరిధిలో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మైనర్లు నడుపుతున్న ఐదు వాహనాలను స్వాధీనం చేసుకుని, వారిపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. తల్లిదండ్రులు మైనర్లకు బైక్‌లు ఇవ్వరాదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



చోడవరం మండలం గవరవరం హైస్కూల్‌లో మాట్లాడుతున్న హెచ్ఎం సుందర్‌సింగ్



బుచ్చెయ్యపేట మండలం తురకలపూడిలో తెలుగుతల్లి వేషధారణలతో విద్యార్థినులు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

చోడవరం, ఆగస్టు 29 : తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు పలు పాఠశాలల్లో జరిగిన ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు తెలుగు భాష ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈవో కె.సింహాచలంతో పాటు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : మండలంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వడ్డాది ప్రాథమిక పాఠశాలల్లో, జూనియర్ కళాశాల్లో, తురకలపూడి జడ్పీ హైస్కూల్‌లో గిడుగు రామూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పింరు. పలువురు వక్తలు మాట్లాడుతూ తెలుగుభాష గొప్పతనాన్ని వివరించారు. తురకలపూడి జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల తెలుగుతల్లి ప్రదర్శన ఆకట్టుకుంది. నేతవానిపాలెంలో ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, అధ్యాపకులు, అతిథి దేవోభవ సేవా స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు, హెచ్ఎం దుర్గా ప్రసాద్, జి.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట : మండల కేంద్రం రోలుగుంట, కుసర్లపూడి జడ్పీ పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఆయా ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుసర్లపూడి జడ్పీ పాఠశాలలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. హెచ్ఎం మోహన్‌రావుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : తెలుగు భాషా దినోత్సవాన్ని మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించారు. తెలుగు భాష గొప్పతనాన్ని వక్తలు వివరించారు. ఇదిలావుంటే, ఇక్కడి అయ్యన్న విద్యా సంస్థల్లో జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ డైరెక్టర్, బీజేపీ సీనియర్ నాయకులు చల్లా సత్యనారాయణమూర్తి, విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీంలతో పాటు ఆయా పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు.

మాడుగుల రూరల్ : మండలంలోని ముకుందపురం ఎంపీపీ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తొలుత పాఠశాల ప్రాంగణంలోని సరస్వతీదేవి విగ్రహానికి పూలమాలలు వేశారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాతృభాష గొప్పతనాన్ని వివరించారు. హెచ్ఎం సత్తిబాబు, ఉపాధ్యాయులతో పాటు అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చీడికాడ మండలం మంచాల మోడల్ స్కూల్‌లో వివిధ వేషధారణలతో అలరిస్తున్న విద్యార్థినులు

చీడికాడ : మాతృభాష గొప్పతనాన్ని అంతా తెలుసుకోవాలని మంచాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చెరకాపు వెంకటలక్ష్మి అన్నారు. పాఠశాలలో గురువారం తెలుగుభాష, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా సాంప్రదాయ దుస్తులు ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. తెలుగు వైభవాన్ని చాటే భువన విజయం నాటికను అద్భుతంగా ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నారు. అలాగే, క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల పిరమిడ్లు కనువిందు చేశాయి. పీఈటీ నాయుడు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చీడికాడ జిల్లా పరిషత్ హైస్కూల్, గ్రం థాలయంలో జరిగిన తెలుగుభాషా దినోత్సవంలో ఎంఈవో కె.బొంజుబాబు, గ్రంథాలయాదికారి ఎంఎస్ఎల్ జోగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



రోలుగుంట మండలం కుసర్లపూడి జడ్పీ పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థినుల ప్రదర్శనలు



మాడుగుల మండలం ముకుందపురంలో పాఠశాలలో..

'అన్ని సౌకర్యాలతో గర్నికంలో పౌర సరఫరాల గోదాం'

రావికమతం, ఆగస్టు 29 : నిత్యావసర సరకుల నిల్వ, సరఫరాల నిమిత్తం మండలంలోని గర్నికం గ్రామంలో గల అగ్నిమాపక కేంద్రం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న సివిల్ సప్లయి గోదాంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జయంతి తెలిపారు. ఈ మేరకు గురువారం నిర్మాణాంలో ఉన్న నూతన గోదాంను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బీఎన్ రోడ్డు నుంచి గోదాం వరకు లారీల రాకపోకలకు అనువుగా రహదారిని నిర్మించాలన్నారు. ఇక్కడ విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ఈ గోదాం నిర్మాణం పూర్తయితే రావికమతం, బుచ్చెయ్యపేట మండలాలకు అవసరమైన నిత్యావసర సరకుల నిల్వకు, సరఫరాకు ఢోకా ఉండద న్నారు. ఇక్కడ ఇంత వరకూ ఉన్న ఈ గోదాం శిథిలమై ఈ రెండు మండలాలకు సరపడ్డ నిత్యావసరాల నిల్వలకు కాస్త ఇబ్బందులు తలెత్తేవన్నారు. ఈ గోదాం నిర్మాణం పూర్తయితే ఆ పరిస్థితి ఉండదని వివంచారు. ఇక్కడ ఆఫీస్ రూమ్, విశ్రాంతి గది, మరుగు దొడ్లు, నైట్ వాచ్‌మేన్‌ను ఏర్పాటు చేయాలని హమాలీలు కోరగా, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతానని ఆమె వారికి తెలిపారు. అనంతరం ఇక్కడున్న గోదాంలో నిల్వలను తనిఖీ చేసి, గోదాం ఇన్‌చార్జి గంగారావుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విక్రాంత్ పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గం

కూండ్రపువానిపాలెంలో లక్ష్మీదేవికి పూజలు



లక్ష్మీదేవి కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

కె.కోటపాడు, ఆగస్టు 29 : మండలంలోని కూండ్రపువానిపాలెంలో శ్రావణ గురువారం ఏకాదశిని పురస్కరించుకుని లక్ష్మీదేవికి విశేష పూజలు నిర్వహించారు. సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా అనకాపల్లి జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త సాయిలక్ష్మి అమ్మవారిని ఆరాధించారు. పెద్ద సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు జరిపారు. జిల్లా అధ్యక్షులు కోరెడ్డి అప్పల నాయుడు, మండల ఇన్‌చార్జి కన్నూరు అప్పలనాయుడు, సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు, టీడీపీ నాయకులు జూరెడ్డి రాము, కన్నూరు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోజంతా ముసురు వాతావరణం

మాడుగుల రూరల్, ఆగస్టు 29 : నియోజకవర్గంలోని మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు మండలాల్లో గురువారం ముసురు వాతావరణం నెలకొంది. దీంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల రహదారులు చిత్తడిగా మారాయి. బుధవారం రాత్రి తేలిక పాటి వర్షం పడింది. అదే వాతావరణం గురువారం రోజంతా కొనసాగింది. ఈ తాజా వాతవరణం పంటలు పండించేందుకు ఎంతో అనుకూలమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హాట్ కేకుల్లా సరుగుడు నారు అమ్మకం



దేవరాపల్లిలో అమ్మకాలు జరుపుతున్న సరుగుడు నారు

దేవరాపల్లి, ఆగస్టు 29 : వాతావరణంలో మార్పుల కారణంగా చిరు జల్లులు పడుతుండడంతో సరుగుడు నారుకు మండి డిమాండ్ ఏర్పడింది. జుంజూరు, స్టోన్స్ సాధారణ సరుగుడు రకాలు అమ్మకానికి పూడిమడక, రాంబిల్లి, పెందుర్తి నుంచి ఉదయం ఏడు గంటలకే ఇక్కడి మార్కెట్ తీసుకు వచ్చారు. జుంజూరు, స్టోన్స్ రకాలు మొక్క రెండు రూపాయలు చొప్పున, సాధారణ సరుగుడు మొక్క రూపాయి చొప్పున అమ్మకాలు జరిగాయి. హాట్ కేకుల వలే అమ్ముడయ్యాయి. పెట్టు బడులు పెరగడంతో వరి పండించే రైతులు చాలా మంది సరుగుడు పంట సాగుపై దృష్టి సారిస్తుండడమే ఇందుకు కారణమని పలువురు చెపుతున్నారు.